సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి అంజయ్యయాదవ్

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

- నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి అంజయ్యయాదవ్

చౌటుప్పల్, మే 23 : మండల పరిధిలోని దామెర గ్రామంలో గల బాలాజీ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహిస్తున్న పట్టభద్రుల సన్నాహక సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి రానున్నట్లు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జీలు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, సూర్యాపేట జడ్పీ వైస్ చైర్మన్ గోపగోని వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. నియోజకవర్గంలోని పట్టభద్రులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఖమ్మం-వరంగల్-నల్లగొండ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, పెద్దిటి బుచ్చిరెడ్డి, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, ఊడుగు మల్లేశం గౌడ్, ఢిల్లీ మాధవరెడ్డి, తాడూరి పరమేశ్, చిన్నం బాలరాజు, మెట్టు మహేశ్వర్‌రెడ్డి, విజయ్, గంగాదేవి రమేశ్‌బాబు, మహేశ్‌గౌడ్, పరశురామ్, శివ పాల్గొన్నారు.

బుద్ధ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఘనంగా బుద్ధ జయంతి

చౌటుప్పల్, మే 23 : మండల పరిధిలోని పంతంగి గ్రామ 65వ జాతీయ రహదారి పక్కన ఉన్న బుద్ధ విగ్రహం వద్ద బుద్ధ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. బుద్ధ ఎడ్యుకేషన్ అండ్ సోషల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బుద్ధుడి బోధనలు పలువురు వివరించారు. కార్యక్రమంలో చిట్యాల రాజు, వేముల శేఖర్, బోయ మల్లేశ్, చుక్క గిరి, వెంకటేశ్ మహాజన్, మల్లికార్జున్, భాస్కర్ పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ

చౌటుప్పల్, మే 23 : విత్తనాలు, ఎరువుల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ అన్నారు. గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల ప్యాకెట్ల ప్యాకింగ్ తేదీలు, లేబుళ్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. లైసెన్స్ ఉన్న దుకాణాల్లో విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. కొనుగోలు చేసేటప్పుడు తప్ప

దుకాణాలను తనిఖీ చేస్తున్న అనూరాధ

నిసరిగా రసీదు తీసుకోవాలని పేర్కొన్నారు. ఏఓ ముత్యాల నాగరాజు పాల్గొన్నారు.

ఎఫ్ఎన్ఓను సస్పెండ్ చేయాలని ధర్నా

చౌటుప్పల్, మే 23 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఎఫ్ఎన్ఓగా పని చేస్తున్న సావిత్రి తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నదని ఆరోపిస్తూ దవాఖాన సిబ్బంది గురువారం ధర్నాకు దిగారు. ఇక్కడ పని చేస్తున్న తమపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కేసులు పెట్టి బెదిరిస్తున్నదని వారు ఆరోపించారు. తమను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆమెను విధుల నుంచి బహిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ధర్నా చేస్తున్న సిబ్బంది

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి కలెక్టరేట్, మే 23 : ఇంటి నుంచి ఐదు నెలల క్రితం అదృశ్యమైన వ్యక్తి కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని పచ్చర్లబోడుతండాలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కునుసోతు లింగ్యానాయక్(40) జనవరి 11న అదృశ్యం కాగా, అదే నెల 16న కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా గ్రామానికి చెందిన బానోతు దేవ్‌సింగ్, పానుగోతు నరేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. ఈ మేరకు పోలీసులు, గ్రామస్తుల సహకారంతో మూసీ వాగు మధ్యలోని గడ్డిపొదల్లో కుళ్లిన స్థితిలో లింగ్యానాయక్ మృతదేహాన్ని వెలికితీశారు. తదనంతరం సంఘటనా స్థలంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఉలిక్కిపడ్డ పచ్చర్లబోడుతండా..

గ్రామానికి చెందిన లింగ్యానాయక్ అదృశ్యమై ఐదు నెలల తరువాత గ్రామ సమీపంలోని మూసీ వాగు మధ్యలో గ్రామానికి చెందిన దేవ్‌సింగ్, నరేశ్.. లింగ్యానాయక్‌ను హత్య చేసి మూటగట్టి గడ్డి మధ్యలో దాచిపెట్టారన్న విషయం తెలిసిన వెంటనే తండావాసులంతా ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యారు. నిందితులు పోలీసులకు లొంగిపోయి హత్య చేసిన విషయాన్ని తెలుపగా పోలీసులు నిందితులతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. హత్య ఉదంతం తెలిసిన వెంటనే ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, రూరల్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తండాలో పోలీసులు పహారా ఏర్పాటు చేశారు.

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గ్యాస్ కొరతతో వినియోగదారుల ఇబ్బందులు

సంస్థాన్ నారాయణపురం, మే 23 : మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీలో 15 రోజులుగా సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాంతో వినియోగదారులు గురువారం ఏజెన్సీ ముందు ఆందోళన దిగారు. గ్యాస్ బుక్ చేసుకుని 15 రోజులు గడుస్తున్నా సిలిండర్లు అందడం లేదని, అదే కిరాణ షాపులు, హోటల్స్‌కు మూడు, నాలుగు సిలిండర్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. గ్యాస్ ఏజెన్సీలో నో స్టాక్ బోర్డులు పెడుతున్నారని, అదే బ్లాక్‌లో అయితే రూ.1,450కు దొరుకుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉండేలా చూడాలని లేని పక్షంలో గ్యాస్ కనెక్షన్లు రద్దు చేసి డిపాజిట్లు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు.

పట్టభద్రులంతా ఏకమై రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

- మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట టౌన్ : పట్టణంలోని విద్యానగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట టౌన్, మే 23 : మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, వ్యాపారులు, యువత ఇలా అన్ని రంగాల పట్టభద్రులంతా ఏకమై ఈ నెల 27న జరుగనున్న వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన పట్టభద్రుల ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఆలోచన చేసి విద్యావంతుల సమస్యల పట్ల అవగాహన ఉన్న, ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డిని చట్టసభల్లోకి పంపాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ మోసపూరిత పార్టీలేనని, ఆ పార్టీల అభ్యర్థులకు ఓటేస్తే ఓటు వృథాయే తప్ప ఎవరికీ ఉపయోగపడదన్నారు. మాయ మాటలతో, మోసపూరిత హామీలతో శాసనసభ ఎన్నికల్లో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య పాలన తీరు అందరికీ అర్థమైందన్నారు. అటువంటి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తున్న బ్లాక్ మెయిలర్ తీన్మార్ మల్లన్నను గొప్పగా చూపిస్తూ ఓట్లడగడం విడ్డురంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు భావ్‌సింగ్, లింగరాజు పాల్గొన్నారు.

నయా నయీమా? ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డినా? : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ రాకేశ్‌కుమార్

కోదాడ : మేధావులు, పెద్దల సభకు పంపేది సమాజానికి పట్టిన చీడ పురుగు నయా నయీంనా ? లేక ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డినా పట్టభద్రులు ఆలోచించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి రాకేశ్‌కుమార్ అన్నారు. గురువారం కోదాడ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెదిరించి డబ్బులు వసూలు చేయడం, ఆడవాళ్ల ఫొటోలు మార్ఫడం, వారిని అవమానించడం, రాజకీయ నాయకులను పరుష పదజాలంతో దూషించడం తదితర అభియోగాలపై 56 క్రిమినల్ కేసులను పునికి పుచ్చుకున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు తగిన బుద్ధి చెప్పి ఉన్నత విద్యావంతుడు, మేధావి, తెలంగాణ ప్రజల ఆకాంక్షల పట్ల శాస్త్రీయ అవగాహన ఉన్న ఏనుగుల రాకేశ్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌తో పాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని తీన్మార్ మల్లన్న ఏ స్థాయిలో విమర్శించాడో అందరికీ తెలిసిందేనన్నారు. అటువంటి వ్యక్తికి టికెట్ ఇచ్చి సమాజానికి ఏం సందేశం ఇద్దామనుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్ష అభ్యర్థి గెలిస్తేనే అధికార పక్షాన్ని నిలదీసి సమస్యలు పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకే విద్యార్థి, నిరుద్యోగ, ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల సమస్యలను శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డికి తమ తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి : హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి

హుజూర్‌నగర్ ,మే 23 : ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పేరు చెబితేనే అంతా భయపడుతున్నారని, ఒక బ్లాక్ మెయిలర్‌కు టిక్కెట్ ఇచ్చి ఆ పార్టీ తన సిద్ధాంతాన్ని బయట పెట్టిందన్నారు. అధికారంలోని వచ్చిన రెండు నెలల్లోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ నిరుద్యోగులను మోసం చేసిందని దుయ్యబట్టారు. మహిళలకు స్కూటీలు, నిరుద్యోగులకు నగదు కార్డు ఏమైందని ఆయన ప్రశ్నించారు. నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేసే దమ్మున్న రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, పార్టీ నాయకులు డాక్టర్ కేఎల్ఎన్‌రెడ్డి, బెల్లకొండ అమర్, జక్కుల నాగేశ్వర్‌రావు, దొడ్డా నరసింహారావు, నగేశ్ రాథోడ్, ఉపేందర్, ములకలపల్లి రాంబాబు పాల్గొన్నారు.

గరిడేపల్లి : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధికార ప్రతినిధి రాం సైదులు, పొనుగోడు గ్రామాధ్యక్షుడు చామకూరి అంజిగౌడ్ అన్నారు. పొనుగోడు గ్రామంలో రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించి మాట్లాడారు.

కోదాడ టౌన్ : రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కోదాడ పట్టణ 26వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు ఎస్‌కే నయీం, వార్డు ఇన్‌చార్జి మహ్మద్ షాకీర్ అధ్వర్యంలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పిట్టల భాగ్యమ్మ, వార్డు కార్యదర్శి జహీర్, మహిమూద్, అబ్బు, ఆరిఫ్, నసీర్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో దూపటి రవీందర్, నరోత్తంరెడ్డి, బర్ల వెంకన్న, మూల వెంకట్‌రెడ్డి, యాకూబ్‌నాయక్, బెడద కరుణాకర్, త్రిశూల్, వెంకన్న, కృష్ణ, జగన్, మల్లేశ్, ఉమేశ్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండలంలోని అన్నారం, గొట్టిపర్తి, గానుగుబండ గ్రామాల్లో రాకేశ్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, తునికి సాయిలు, దొంగరి శ్రీను, మట్టపల్లి వెంకట్, గోపగాని శ్రీను, గోపగాని వెంకన్న, తడకమళ్ల రవికుమార్, శ్రీకాంత్, వెంకటేశ్, దుర్గయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

మోత్కూరులో పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతున్న తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, పక్కన ఎన్నికల సమన్వయ కర్త గోలి శ్రీనివాస్‌రెడ్డి

పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలి

- తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మోత్కూరు, మే 23 : పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని, ప్రజా గొంతుక, విద్యావంతుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కోరారు. గురువారం మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఆర్యవైశ్య భవనంలో నిర్వహించిన పట్టభద్రులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి ఐదు నెలల పాలనలో 20 వేల కోట్ల అప్పులు చేశాడన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి పాటు పడి నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో 2లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అంటూ దొంగ మాటలు చెప్పి మోసం చేశాడన్నారు. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండానే 30 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పుకొనేందుకు సిగ్గుండాలన్నారు. క్వింటా వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల సందర్భంగా ప్రకటించి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని విమర్శించారు. 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ఇప్పుడు 5 గ్యారెంటీలు అమలు చేశామని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన వాళ్లకు ఓటేద్దామా...? పదేండ్లపాటు నిజాయితీగా పని చేసిన కేసీఆర్ అభ్యర్థి, విద్యావంతుడు రాకేశ్‌రెడ్డికి ఓటేద్దామా? అని అన్నారు. బ్లాక్ మెయిలర్ తీన్మార్ మల్లన్నకు తగిన గుణపాఠం చెప్పేందుకు పట్టభద్రులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త గోలి శ్రీనివాస్‌రెడ్డి, మోత్కూరు, అడ్డగూడూరు బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు యాకూబ్‌రెడ్డి, మేఘారెడ్డి, మహేందర్ నాథ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గరిడేపల్లి : పొనుగోడులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి రాం సైదులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఓటు వేసే విధానాన్ని ఓటర్లకు వివరిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒట్టెంద నరసింహారెడ్డి

కోదాడ : కోదాడలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ రాకేశ్‌కుమార్, పక్కన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

నాగారం : ఎంపీడీఓ కార్యాలయంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఉప్పలయ్య

తుంగతుర్తి : అన్నారంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోదాడ టౌన్ : కోదాడ పట్టణ 26వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఎస్‌కే నయీం

నేడు కోరమండల్ ఫర్టిలైజర్ రేట్ పాయింట్ ప్రారంభోత్సవం

భువనగిరి కలెక్టరేట్, మే 23 : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో శివరాజ్‌గౌడ్ గోదాములో కోరమండల్ ఫర్టిలైజర్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ రేట్ పాయింట్‌ను కలెక్టర్ హనుమంతు కె.జెండగే శుక్రవారం ప్రారంభించనున్నారు. నలభై వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములో కోరమండల్ ఫర్టిలైజర్స్‌కు సంబంధించి డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులోకి రానున్నాయి. దాంతో డీలర్లు, రైతులకు దూర భారం తగ్గనున్నది. ఇప్పటివరకు మిర్యాలగూడలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ దిగుమతి చేసుకొని యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎగుమతి చేసేవారు. అక్కడి నుంచి ఫర్టిలైజర్ కోసం అధికారులు ఇండెంట్ పంపడం, స్టాక్‌ను బట్టి ఫర్టిలైజర్‌ను దిగుమతి చేయడం తదితర అంశాల్లో జాప్యం జరిగేది. ఇప్పుడు ఫర్టిలైజర్ రేట్ పాయింట్ ఓపెనింగ్‌తో ఈ ప్రాంత రైతులకు అన్ని రకాల ఫర్టిలైజర్స్ అందుబాటులోకి రానున్నాయి.

విధుల్లో అస్వస్థతకు గురై వ్యక్తి మృతి

- ఎస్వీ ల్యాబ్‌లో ఘటన

చౌటుప్పల్, మే 23 : విధుల్లో అస్వస్థతకు గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామ పరిధిలోని ఎస్వీ ల్యాబ్ పరిశ్రమలో బుధవారం రాత్రి జరుగగా గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన కట్టబోయిన నాగరాజు (34) పట్టణ కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో నివాసముంటున్నాడు. ఎస్వీ ల్యాబ్‌లో షిఫ్ట్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా బుధవారం రాత్రి రియాక్టర్‌లో రసాయనాలు వేస్తుండగా ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన తోటి సిబ్బంది అతడిని వెంటనే చికిత్స కోసం హైదరాబాద్ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. నాగరాజుకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలి

ఆత్మకూరు(ఎం), మే23 : వేసవి సెలవులు ముగిసేలోపే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. మరుగు దొడ్లు, మూత్ర శాలలను, నీటి వసతిని పరిశీలించారు. పాఠశాలల్లో పచ్చదనం పెంచాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంతో పాటు సర్వేపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ నిరంజన్‌వలి, ఏఈ ధనలక్ష్మి, ఏపీఎం కిరణ్, సీసీలు వెంకన్న, భాస్కర్, శిరీష ఉన్నారు.

మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేయాలి : ఎంపీడీఓ నిరంజన్‌వలి

ఆత్మకూరు(ఎం), మే 23 : హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు వీలుగా అన్ని గ్రామాల్లో గుంతలు తీయించాలని ఎంపీడీఓ నిరంజన్‌వలి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల వెంట, ప్రభుత్వ స్థలాల్లో అన్ని రకాల మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీఓ పద్మావతి, ఏపీఓ రమేశ్, ఈసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

తుర్కపల్లి, మే23 : మండలంలోని వెంకటాపురం గ్రామంలోని కొండపై వెలిసిన వెంకటగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కల్యాణం అనంతరం దేవాతామూర్తులకు ఒడిబియ్యం పోశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో మాట్లాడుతున్న మైలారం జంగయ్య

బొమ్మలరామారం, మే23 : మండల కేంద్రంలో గురువారం పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం కన్వీనర్ మైలారం జంగయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పట్టభద్రులకు స్వయం ఉపాధి కోసం ఎలాంటి షరతులు లేకుండా రూ.10 లక్షల వడ్డీలేని రుణం మంజూరుచేయాలని, పరిశ్రమల్లోని ఉద్యోగాల్లో స్థానిక పట్టభద్రులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పట్టభద్రులు కొడిమాల శ్యామ్‌సుందర్‌రెడ్డి, గులని మహేశ్, వడ్త్య రమేశ్, జె.విజయరాజు, విశ్వనాథ్, నాగరాజు, అనిల్, విశ్వరూప్ పాల్గొన్నారు.

కమనీయం.. మట్టపల్లి లక్ష్మీనృసింహుడి కల్యాణం

మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు

మఠంపల్లి, మే 23 : పంచ నారసింహ క్షేత్రాల్లో ఒకటిగా వెలుగొందుతున్న మట్టపల్లి రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామి వారి తిరు కల్యాణం గురువారం తెల్లవారుజామున వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, అశేష భక్త జన వాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి వారికి ఎదుర్కోలు మహోత్సవం జరిపించారు. స్వామి వారి కల్యాణం తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, చెన్నై ప్రాంతాల నుంచి సుమారు 50 వేల మందికి పైగా భక్తులు విచ్చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమందరాజు నేతృత్వంలో భద్రతా చర్యలు చేపట్టారు. ప్రముఖ కవులు, కళాకారులతో నిర్వహించిన బుర్రకథ, హరికథ, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు అలాగే సాగర్, నాగార్జున సిమెంట్స్ పరిశ్రమ యాజమాన్యం భక్తులకు మినరల్ వాటర్, మజ్జిగ పంపిణీ చేసింది. అన్నదాన సత్రాల్లో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, చెన్నూరి విజయ్‌కుమార్, ఈఓ నవీన్, కల్యాణోత్సవం నిర్వహణ యజ్ఞికులు బొర్ర వెంకట వాసుదేవాచార్యులు, వ్యాఖ్యాత సోమయాజుల లక్ష్మీనరసింహశాస్త్రి, కొడవగంటి శ్రీనాథశర్మ, మహాదేవశర్మ పాల్గొన్నారు.

బియ్యపు గింజలపై నారసింహ నామం

మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామిపై భక్తితో మిర్యాలగూడెం పట్టణానికి చెందిన గుంటూరు ప్రియవర్షిణి 31,116 బియ్యపు గింజలపై నారసింహ నామం, అలాగే 13 గింజలపై నరసింహస్వామి మంత్రం రాసి సమర్పించారు. తన తండ్రి శ్రీనివాస్‌రావు కోరికను కూతురు నెరవేర్చి స్వామివారి కల్యాణానికి బియ్యపు గింజలను సమర్పించి మొక్కు చెల్లించుకున్నది. ప్రియవర్షిణిని ఆలయ అర్చకులు, చైర్మన్ శాలువాలతో సన్మానించి ఆశీర్వదించారు.

స్వామి వారి కల్యాణానికి హాజరైన భక్తజనం